క్లుప్తంగా

లాలాపేట ఎస్‌హెచ్‌వోగా శివప్రసాద్ బాధ్యతల స్వీకరణ



పట్నంబజారు: లాలాపేట పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వోగా ఏ.శివప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. 2002 బ్యాచ్‌కు చెందిన ఆయన ఎస్ఐగా అనేక ప్రాంతాల్లో పని చేశారు. 2012లో సీఐగా పదోన్నతి లభించింది. అనంతరం అరండల్‌పేట, సీఐడీ, నర్సరావుపేట, కోవూరు, సీసీఎస్, పీసీఆర్, అమరావతి ప్రాంతాల్లో ఎస్‌హెచ్‌వో బాధ్యతలు నిర్వహించారు. ఈ క్రమంలో లాలాపేట ఎస్‌హెచ్‌వోగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం శివప్రసాద్ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని తెలిపారు. ముఖ్యంగా గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు.

కొత్తపేట ఎస్‌హెచ్‌ఓగా వీరయ్య..



పట్నంబజారు: కొత్తపేట సబ్ డివిజన్ ఎస్‌హెచ్‌ఓగా ఎం.వీరయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. 2002 బ్యాచ్‌కు చెందిన ఆయన ఎస్ఐగా పల్నాడు, గుంటూరు తదితర ప్రాంతాల్లో పనిచేశారు. 2012లో సీఐగా పదోన్నతి దక్కింది. అనంతరం పొన్నూరు, తెనాలి, నరసరావుపేట, మాచర్ల తోపాటు, పల్నాడులోని పలు ప్రాంతాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. వీఆర్‌లో ఉన్న ఆయన్ను కొత్తపేట ఎస్‌హెచ్‌ఓగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన ఎస్‌హెచ్‌ఓ వీరయ్య మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపడతామని తెలిపారు. గంజాయి, అక్రమ మద్యం అమ్మకాలను అరికడతామని చెప్పారు.

కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగుళూరులో కంప్యూటర్, ట్యాలీ నైపుణ్యంపై ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి హరిప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 28 ఏళ్ల లోపు వయసు గల అభ్యర్థులకు బెంగుళూరులో 35 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, స్పోకెన్ ఇంగ్లిషు, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ కల్పించి, శిక్షణానంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15వేలకు పైబడిన వేతనంతో నూరు శాతం ఉద్యోగాలను చూపిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 90004 87423 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల హాజరు పెంచాలి: డీఈవో

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు రెగ్యులర్‌గా హాజరయ్యే విధంగా పర్యవేక్షించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఆదేశించారు. మణిపురం సమీపంలోని బొర్రా నాగేశ్వరరావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. తరగతుల వారీగా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించిన అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. విద్యార్థులంతా సమయపాలన పాటించే విధంగా పర్యవేక్షించాలని ఉపాధ్యాయుల్ని ఆదేశించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనాన్ని విద్యార్థులంతా తినే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. భోజన నాణ్యత విషయంలో రాజీపడరాదని సూచించారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ జిలానీ బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తోన్న శ్రీమద్భగవద్గీతలోని తొమ్మిదో అధ్యాయం- రాజవిద్యా రాజగుహ్య యోగంపై ఆధ్యాత్మిక ప్రవచనాలు ముగిశాయి. బండ్లమూడి విజయలక్ష్మి సౌజన్యంతో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. చిన్మయ మిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడితో తనను భక్తితో పూజించు వారు తనయందు ఉంటారని, వారితో ప్రత్యక్షంగా ఉంటానని తెలిపారని వివరించారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కార్యాచరణ ప్రణాళిక

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక ఉండాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. స్థానిక వీడియో సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్, రెవెన్యూ, రోడ్లు భవనాల శాఖాధికారులు సమష్టిగా కృషి చేయాలని చెప్పారు. రహదారి ప్రమాదాల్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో క్రమపద్ధతిలో నమోదు చేసే విధంగా చూడాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో అధికారులు విచారించి బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ కూడళ్ల వద్ద సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ట్రాఫిక్ జామ్ కాకుండా అవసరమైన సైన్ బోర్డులు, జీబ్రాలైన్, డివైడర్స్ తదితర ఏర్పాట్లు చేయాలని చెప్పారు. జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణతోపాటు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ద్విచక్ర వాహనాలు, ఆటోలు సర్వీస్ రోడ్లలో వెళ్ళే విధంగా చూడాలని చెప్పారు. ఆటోల్లో మోతాదుకు మించిన ప్యాసింజర్లను ఎక్కించకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం, జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, ఎక్సైజ్ శాఖ ఈఎస్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

గిరిజనులు, ఆదివాసీల సంక్షేమానికి కృషి

కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి



ఏకలవ్య విగ్రహం వద్ద విల్లు ఎక్కు పెడుతున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

నెహ్రూనగర్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని నాజ్ సెంటర్‌లోని ఏకలవ్య, అల్లూరి సీతారామరాజు, వెన్నలగంటి రాఘవయ్య విగ్రహాలకు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు మహమ్మద్ నజీర్‌తో కలసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో దాదాపు 3.3 శాతం మంది ఆదివాసీలు ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. జిల్లాలో మూడు రెసిడెన్షియల్ స్కూళ్లు, నాలుగు హాస్టళ్లలో 800 మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. గిరిజనుల ఆరోగ్యం మెరుగుపరచేందుకు ఎస్టీ ఏరియాలలో ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ దాక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. అనంతరం నాజ్ సెంటర్ నుంచి రెవెన్యూ కల్యాణ మండపం వరకు గిరిజన సాంస్కృతిక ర్యాలీని నిర్వహించారు. ఎమ్మెల్యే నజీర్ మాట్లాడుతూ ఆదివాసీల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం గిరిజనులు ప్రదర్శించిన కరసాము ప్రదర్శనను జిల్లా కలెక్టర్ ఆసక్తిగా తిలకించి , సాంస్కృతిక ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్డీఓ పి. శ్రీకర్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి శిరీష, గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్ నగేష్ , జిల్లా న్యూక్లియస్ అధికారి లక్ష్మా నాయక్ , డీడీ హార్టికల్చర్ రవీంద్ర , లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్ర నాయక్ పాల్గొన్నారు.

భీమ్ భారత్ కార్యాలయంలో...

వేల సంవత్సరాల నుంచి అడవిని నమ్ముకుని జీవిస్తున్నా ఆదివాసీ తెగలకు సంపూర్ణ హక్కులు కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వం చట్టం రూపొందించాలని బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర కోఆర్డినేటర్ సాధు మాల్యాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అరండల్‌పేటలోని భీమ్ భారత్ కార్యాలయంలో అంతర్జాతీయ ఆదివాసీ హక్కుల దినోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ సామాజిక, సాంస్కృతిక రాజకీయ జీవన విధానం దెబ్బదీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో వివిధ సంఘా నాయకులు పాగళ్ల ప్రకాష్, పాటిబండ్ల కోటేశ్వరరావు, అంకం శ్యామ్, వేల్పూరి నరసింహారావు, శిఖా సురేష్, కోటేశ్వరమ్మ, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



అరండల్‌పేట శ్రీఅష్టలక్ష్మి ఆలయంలో సమష్టి వ్రత పూజలు చేస్తున్న మహిళలు

నగరంపాలెం: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని స్థానిక అరండల్‌పేట శ్రీఅష్టలక్ష్మీ మందిరంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాద్ బృందం శ్రావణ మాస విశేష పూజలు చేపట్టారు. అత్యంత భక్తిశ్రద్ధలతో మహిళలు శ్రావణ శుక్రవారం పూజలు చేశారు. వేదం, మంత్రాల అంతరార్థాలను మర్రిపాటి ప్రసాద్ భక్తులకు వివరించారు. ప్రతి రోజు సాయంత్రం లలిత సహస్రనామ పారాయణాలు, విశేష కుంకుమ పూజలు చేపడతామని తెలిపారు. విశేష హారతులు, మంత్రపుష్పం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

శ్రీకనకమహాలక్ష్మికి విశేష పూజలు

స్థానిక సిద్ధార్థనగర్ శ్రీకనకమహాలక్ష్మీ మందిరంలో అమ్మవారికి రకరకాల పుష్పాలతో అలంకరించారు. శ్రావణ శుక్రవార వ్రతాన్ని నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మహాహారతి, మంత్ర పుష్పం అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమాలను వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ ఘంటసాల విజయకుమార్ పర్యవేక్షించారు.

మంగళగౌరీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారు మంగళగౌరీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామికి విశేష అభిషేకం, అలంకరణతో పాటు అమ్మవారిని మంగళగౌరీదేవిగా విశేష అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేయించుకున్నారు.

రేపు భక్తి సంగీత విభావరి

నగరంపాలెం: బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికపై ఆదివారం భక్తి సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు శ్రీసాయిరాగ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ మునిపల్లె రమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6.30 గంటలకు సంగీత విభావరి మొదలవుతుందని, తనతోపాటు శిష్యురాలైన నాగసరపు నాగవెంకట తిషిత అన్నమయ్య కీర్తనలు, ప్రైవేటు భక్తి కీర్తనల్ని ఆలపించనున్నట్లు పేర్కొన్నారు. సంగీతాభిమానులు హాజరై జయప్రదం చేయాలని ఆమె కోరారు.

పుస్తకం విజ్ఞానాన్ని పెంచే వారధి



లక్ష్మీపురం: పుస్తకం విజ్ఞానాన్ని పెంచే వారధి అని సీనియర్ ఇంజినీర్ ఎస్.సదాశివం అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం పుస్తక ప్రియుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తిని శక్తిగా మార్చేందుకు సాధనం, ఆయుధం పుస్తకమేనని తెలిపారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సీనియర్ సిటిజన్స్,పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం నిర్వహించారు.

సమాజ సేవలో రోటరీ సేవలు అభినందనీయం



మంగళగిరి: సమాజ సేవలో మంగళగిరి రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని ఇందిరానగర్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి. అనూష తెలిపారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో హెల్త్ సెంటర్‌కు శుక్రవారం బీరువా బహూకరించారు. రోగులకు సేవలందించడంలో హెల్త్ సెంటర్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించి, కేంద్ర ప్రభుత్వం నుంచి ఎన్క్యాస్ సర్టిఫికెట్ పొందడం ప్రశంసనీయమని సభ్యులు కొనియాడారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు గాజుల శ్రీనివాసరావు, ఇసునూరి అనిల్ చక్రవర్తి,అందే మురళీ మోహనరావు, ప్రగడ రాజశేఖర్, త్రిపురమల్లు సతీష్, బట్టు నారాయణరావు పాల్గొన్నారు.

హెచ్ఐవీ లేని సమాజ నిర్మాణం యువతతోనే సాధ్యం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాసులు

గుంటూరు మెడికల్: హెచ్ఐవీ లేని సమాజ నిర్మాణం యువతతోనే సాధ్యమని జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు అన్నారు. యువత హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణా విభాగం గుంటూరు ఆధ్వర్యంలో స్థానిక టీజేపీఎస్ కళాశాలలో విద్యార్థులకు హెచ్ఐవీపై క్విజ్ పోటీలు నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ మేజర్ మనోహర్ మాట్లాడుతూ సురక్షితం కాని లైంగిక సంబంధాలు, కలుషిత రక్త మార్పిడి, కలుషిత సూదులు సిరంజీలు వాడడం ద్వారా, తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సోకుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ సెక్రటరీ కె.వి.బ్రహ్మం, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ శాంసన్, జిల్లా సూపర్‌వైజర్ జ్యోతుల వీరాస్వామి, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జె.వి.సుధీర్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్. జయ శైలజ పాల్గొన్నారు.అనంతరం క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నాయకులు

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణలో సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ఢిల్లీలో మాలల మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాల సంఘాల జేఏసీ చైర్మన్ గోళ్ల అరుణ్‌కుమార్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆగస్టు 1న ఏకపక్ష నిర్ణయంతో, కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో దళితులను విడదీసే ఎస్సీ వర్గీకరణకు అనుకూలమైన తీర్పును వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. పెరిగిన జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ పెంచకుండా ఎస్సీ వర్గీకరణ పేరిట రిజర్వేషన్ ఎత్తివేసే కుట్రలో భాగంగా క్రిమిలేయర్‌ను తీసుకొచ్చారని మండిపడ్డారు. ఈ విషయంపై సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేసినట్లు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వర్గీకణ విషయంలో ఆర్డినెన్స్ తెస్తే ప్రభుత్వంలోని పెద్దల ఇళ్లను ముట్టడిస్తామని, ప్రభుత్వాలను కుల్చడానికి మాలల సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాల సంఘాల నాయకులు గోదా జాన్‌పాల్, రామచందన్, రవి, కుమారి, కొండబాబు, సుధాకర్ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా గైర్హాజరైతే చర్యలు



సచివాలయ సిబ్బందికి, అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ హరికృష్ణ

నెహ్రూనగర్: వార్డు సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ, పని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ జవాబుదారీతనంతో వ్యవహరించాలని నగర కమిషనర్ కె.హరికృష్ణ స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని తెలిపారు. శుక్రవారం కమిషనర్ సంపత్ నగర్‌లోని 59, 60, 61, 62, 67, 68 వార్డ్ సచివాలయాలను డెప్యూటీ కమిషనర్ సీహెచ్.శ్రీనివాస్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. అనుమతి లేకుండా గైర్హాజరైతే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. సచివాలయం పరిధిలో ఇంటి, కుళాయి పన్నులను నూరు శాతం వసూళ్లు చేయడంలో కార్యదర్శులు కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి కార్యదర్శి తమ విభాగం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

ఉద్యోగోన్నతుల తరువాతే పని సర్దుబాటు చేపట్టాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించిన తరువాతే పని సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ. బాలచంద్రారెడ్డి, కె. శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియపై ఆపస్ రాష్ట్రశాఖ తరఫున చేసిన ప్రతిపాదనల్ని అమలు చేయాలని కోరుతూ శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ నిర్మలా రాణిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఉపాధ్యాయులతో పాటు సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ జీవో 117 ప్రకారం టీచర్లను సర్దుబాటు చేయడాన్ని నిరసిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా సర్దుబాటుకు ఉపక్రమించడం తగదని స్పష్టం చేశారు. 3,4,5 తరగతుల్ని తిరిగి ప్రాథమిక పాఠశాలల్లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆపస్ తరఫున ప్రతిపాదించిన అంశాల్ని వివరించారు. ఏడీని కలిసిన వారిలో ఆపస్ రాష్ట్ర మహిళా కార్యదర్శి పి.పద్మ తదితరులు ఉన్నారు.

బీసీల అభ్యున్నతికి కృషిచేయాలి



కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసిన బీసీ సంఘు నాయకులు

నెహ్రూనగర్: బీసీల అభివృద్ధి, అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు విన్నవించారు. శుక్రవారం ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో ఆయన్ను బీసీ సంఘు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ బీసీలకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో అధిక ప్రాధ్యానత ఇవ్వాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ నాయకులు కుమ్మర క్రాంతికుమార్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాజ్ కిరణ్, పూర్ణచంద్రరావు, శ్రీనివాస్, పళ్ల రమణ, రవి ఉన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలను అభివృద్ధి పరుస్తాం

తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గుంటూరు ఎడ్యుకేషన్: పేద, మధ్య తరగతి విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థినులకు స్వాగతం పలుకుతూ శుక్రవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ వందలాది మంది విద్యార్థినులతో నడుస్తున్న బాలికల కళాశాలలో అసంపూర్తిగా నిలిచిన టాయిలెట్ల నిర్మాణాల్ని పూర్తి చేసేందుకు రూ.24 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. నగరపాలకసంస్థ ద్వారా మురుగునీటి పారుదల వ్యవస్థను ఏర్పాటు చేయిస్తామని పేర్కొన్నారు. కళాశాలలోని విద్యార్థినులకు అవసరమైన రాత పుస్తకాల్ని ఎమ్మెల్యే గ్రాంటు నిధుల ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా చదువులో ప్రతిభావంతులుగా నిలిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ జి.సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత



మొక్కను నాటుతున్న వనమా నరేంద్రకుమార్

గుంటూరు మెడికల్ : ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్‌లో ప్రస్తావించిన 'మా కే నామ్ పే ఏక్ పేడ్' (అమ్మ పేరుతో ఒక మొక్క నాటడం)లో భాగంగా శుక్రవారం బీజేపీ గుంటూరు మహిళా మోర్చా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో స్థానిక కృష్ణనగర్ పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నేడు మనం నాటే మొక్కలు వృక్షాలుగా మారి రేపటి తరానికి అమోఘమైన ఫలాలు, ఆరోగ్యమైన జీవితాన్ని ఇస్తాయని తెలిపారు. మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లేశ్వరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా మోర్చా ఉపాధ్యక్షులు వాణి వెంకట్, మహాలక్ష్మి, జిల్లా కన్వీనర్ సుకన్య, కోలా రేణుకాదేవి, జిల్లా కార్యదర్శి సరోజిని, సభ్యులు మణి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి, లీగల్ సెల్ కన్వీనర్ గూడూరు రాంబాబు, పబ్లిసిటీ అండ్ లిటరేచర్ రాష్ట్ర కన్వీనర్ పాలపాటి రవికుమార్, బీజేపీ 2వ మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ గౌడ్, తిరుపతిరావు, బీజేపీ రాష్ట్ర మీడియా కోకన్వీనర్ వెలగలేటి గంగాధర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పద్మనాభం, రాయుడు, పొన్నపల్లి సోమశేఖర్, మైలవరపు ప్రవీణ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మనోహర్

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు టీజేపీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో శుక్రవారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఎయిడ్స్, క్షయ నియంత్రణ మండలి ఇటీవల జిల్లాస్థాయిలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు కె.రాజ్‌కుమార్, ఎస్‌కే మెహబూబ్ సుభానీ ప్రథమ స్థానంలో నిలిచి, రూ.ఐదువేల నగదు బహుమతి అందుకున్నట్లు చెప్పారు. చదువుతో పాటు మానసిక వికాసాన్ని కలిగించే ఇటువంటి పోటీల్లో ప్రతి విద్యార్థి పాల్గొనాలని సూచించారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థుల్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్నినన కళాశాల అధ్యక్షుడు పోలిశెట్టి శ్యాం సుందర్, వాసవీ విద్యానిధి కమిటీ కార్యదర్శి పోలిశెట్టి నాగ సుందరం, కరస్పాండెంట్ కె.వి. బ్రహ్మం, ఎన్ఎస్ఎస్ జిల్లా అధికారి జె.వి.సుధీర్‌కుమార్, ఆర్. జయశైలజ, అధ్యాపకురాలు దివ్య అభినందించారు.

ఫార్మసీ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మసీ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని ముంబైకు చెందిన గార్డియాన్ మెడికల్ సిస్టమ్స్ ఫార్మా ఐటీ విభాగ ప్రాంతీయ మేనేజర్ జి. వెంకట బాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ''ఫార్మసీ రంగంలో అన్వేషణ-అభివృద్ధి చెందుతున్న ఉపాధి అవకాశాలు'' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట బాలకృష్ణ మాట్లాడుతూ వైద్యారోగ్యశాఖలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన హెల్త్ డిజిటలైజేషన్, టెలీ మెడిసిన్, టెలీ ఫార్మసీ, స్పెషాలిటీ ఫార్మసీ, రూరల్ హెల్త్‌కేర్, రిమోట్ హెల్త్‌కేర్, మెడికల్ కోడింగ్, ఫార్మాకోవిజిలెన్స్ వంటి విభాగాల్లో ఫార్మసీ నిపుణులకు అనేక నూతన ఉపాధి అకాశాలు ఉన్నాయని వివరించారు. ఫార్మసీ విద్యతో పాటు స్టాటిస్టికల్ ఎనాలసిస్ సిస్టమ్, క్లౌడ్ మైక్రోసాఫ్ట్ వంటి సాఫ్ట్‌వేర్ రంగానికి సంబంధించిన కోర్సుల్ని చేయడం ద్వారా ఫార్మా రంగంలో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని సూచించారు. సదస్సులో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్స్ పి. సీతారామయ్య, ఏ. ప్రత్యూష, ఫార్మాస్యూటికల్ ఎనాలసిస్ విభాగాధిపతి డాక్టర్ పి.నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థుల పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి నిస్సాన్ ఎక్స్ ట్రయల్ కారు



నగరంపాలెం: మార్కెట్‌లోకి కొత్త నిస్సాన్ ఎక్స్-ట్రయల్ 7 సీటర్ కారును ఎక్స్‌ప్రెస్ నిస్సాన్ షోరూంలో శుక్ర వారం ఆవిష్కరించారు. మేనేజింగ్ డైరక్టర్ పాములపాటి కిరణ్ మాట్లాడుతూ నిస్సాన్ ఎక్స్- ట్రయిల్ కారు అత్యాధునిక ఫ్యూచర్స్ కలిగి ఉందన్నారు. వీసీ టర్బో ఇంజన్, 360 డిగ్రీ కెమెరా, పనోరమిక్ ఎలక్ట్రికల్ సన్‌రూఫ్, ఏడు ఎయిర్ బ్యాగ్స్, ఆల్ వీల్ డిస్క్ బ్రేక్స్‌తో ఉన్నాయని తెలిపారు. ఈ కారు మూడు రంగుల్లో లభిస్తోందని, బుకింగ్ కోసం 9121144848 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులు కోనేరు శ్రీధర్, డాక్టర్ అట్లూరి పల్లవి, అట్లూరి అనీల్, షోరూం జనరల్ మేనేజర్ సతీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.